



# టాక్ షో కథలు

## - కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 800 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# కార్ల్ మార్క్స్ సమగ్ర జీవిత చిత్రణ

## 8వ భాగం

లండన్ చేరుకునేసరికి మార్క్స్ దగ్గర ఏడు వందల పౌండ్లు వున్నాయి. 5,6 పౌండ్ల కోసం అష్టకష్టాలూ పడిన సందర్భాలున్నాయి. ఏడాది వయసు వున్న పసి బిడ్డ చనిపోతే,శవ పేటిక కొనడానికి కూడా 2పౌండ్లు లేక, 2, 3 రోజులు మృ దేహాన్ని ఇంట్లోనే ఉంచుకున్న దుర్భర దారిద్ర్యం కూడా చవి చూశారు. ఇప్పుడు 7oo పౌండ్లు చేతికి వచ్చాక, కాస్త గౌరవ ప్రదమైన జీవితం గడిపే అవకాశం వచ్చింది.

మార్క్స్ లండన్ రాగానే చేసిన మొట్టమొదటి పని ఏమిటంటే...ఇప్పుడు వాళ్ళు ఉంటున్న 'కౌంటీ స్ట్రవున్' దగ్గరలోనే మరో ఇంటికి మారడం. దీని కంటే ముందున్న ఇంట్లో ముగ్గురు పసి వాళ్ళు చనిపోయారు. ఈ ఇంట్లో కూడా ఒక బాబు పుట్టగానే చనిపోయాడు. పని మనిషి హెలెన్ చెల్లెలు ఈ ఇంట్లోనే చనిపోయింది. వెంటాడి వేధించిన ఈతి బాధలన్నీ ఈ ఇంట్లోనే జరిగాయి.

చేతిలో డబ్బులు వున్నాయి కదా! అందుకని ఇల్లు మారాలనుకున్నారు. అక్కడకు దగ్గరలోనే,అదే పరిసరాల్లో 'మెయిట్ ల్యాండ్ పార్క్ ' అనే చోట "వన్ మోడెనా విల్లాస్" అని ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నారు. (ప్రస్తుతం ఈ ఇల్లు

లేదు. పడగొట్టేసారు.) మార్క్సు, లండన్ వచ్చిన తరువాత ఇది 4 వ ఇల్లు. ఈ ఇంట్లో నే 1875 వరకూ అంటే, దాదాపుగా 11 సంవత్సరములు వున్నారు.

ఈ ‘వన్ మోడెనా విల్లాస్ ‘అనే ఇల్లు చాలా పెద్దది. మూడు అంతస్తుల్లో వుండేది.8 గదులు. చక్కటి గార్డెన్. బయట కూడా విశాలమైన ఖాళీ ప్రదేశం. ముగ్గురు ఆడపిల్లలకీ కూడా ఒక్కొక్కరికీ ఒక్కో గది. వాళ్ళతో పాటు రెండు కుక్కల్నీ, మూడు పిల్లుల్నీ, రెండు పక్షుల్ని కూడా తెచ్చుకున్నారు. ఇంట్లో అందరూ కూడా ఆ పేదరికం నుండి, కాస్త గౌరవ ప్రదమైన జీవితంలోకి అడుగు పెడుతున్నందుకు అందరూ సంతోషించారు. ఇంతకు ముందు ఉన్నటు వంటి అద్దె ఇంటి అనుభవంతో మూడు సంవత్సరాల అద్దె ఒకేసారి చెల్లించాడు. సంవత్సరానికి 65 పౌండ్లు చొప్పున దాదాపు రెండు వందల పౌండ్లు చెల్లించాడు మార్క్సు. ఇంకా 500 పౌండ్లు మిగిలాయి. ఆ కొత్త ఇంట్లో పిల్లలందరూ పండగ వాతావరణం లాగా ఎవరి గదిని వాళ్ళు, నచ్చినట్లుగా అలంకరించుకున్నారు. ఇంట్లోని అన్ని గదుల్లోకి ఫర్నీచర్ నింపడానికని షాపింగ్ కి బయలుదేరింది జెన్నీ.

డబ్బులకు ఇబ్బంది లేదు. అప్పుల వాళ్ళ బాధ లేదు. ఇంక తను రాయవలసిన ‘కేపిటల్‘ పుస్తకం రాయడానికి ప్రణాళికలు వేసుకుంటున్నాడు మార్క్సు.

ఈ పరిస్థితుల్లో జరిగిన మరొక సంఘటన గురించి తెలుసుకోవాలి.ఇక్కడ ఒక్కసారి కథలో 20 సంవత్సరాలు వెనక్కి వెళ్ళాలి. మార్క్సు బెల్జియం లో వుండగా ‘కమ్యూనిస్ట్ లీగ్ ‘అనే సంస్థను స్థాపించాడు.ఆ రోజుల్లోనే ఒకబ్బాయి మార్క్సు దగ్గరకు వచ్చాడు. అతని పేరు “విల్ హెల్మ్ ఫ్రెడరిక్ ఓల్ఫ్” నిక్ నేమ్ “లూపస్ “ అని పిలుస్తారు. ఈ లూపస్ కి మార్క్సు, ఎంగెల్సులంటే గురుభావం వుండేది. అత్యంత గౌరవం వుండేది. ఆ బెల్జియం లో ఉండగానే 'కమ్యూనిస్ట్ లీగ్ “లో పనిచేసేటప్పుడు, ఈ లూపస్ అత్యంత నమ్మకమైన అనుచరుడుగా ఉండేవాడు. ఆ తరువాత రోజుల్లో మార్క్సు వివిధ దేశాలు తిరుగుతున్నప్పుడు, ఈ లూపస్ తన స్వంత దేశమైన స్విజ్జర్లాండ్ వెళ్ళిపోయాడు. మార్క్సు లండన్ వచ్చినపుడు ఈ లూపస్ కూడా లండన్ చేరుకున్నాడు. లండన్ లో మార్క్సు ఇంటికి దగ్గరలో ఉండేవాడు.

మార్క్సు కి సహాయకుడిగా ఉండడమే కాకుండా ఆ ఇంట్లోకి ఏం అవసరం వచ్చినా, ఏ పనైనా ఈ లూపస్సే చేస్తుండేవాడు. అలాగే మార్క్సు అమెరికా పత్రిక్కి వ్యాసాలు రాయాల్సి వచ్చినపుడు, మొదట్లో కొన్ని రోజులు మార్క్సు జర్మనీ భాషలో రాసినటువంటి వ్యాసాల్ని ఈయన ఇంగ్లీష్ లోనికి అనువాదం చేస్తుండేవాడు. ఆ తరువాత కొన్ని రోజులుకి మాంచెస్టర్ లో ఎంగెల్సు వున్నాడు కదా! అక్కడకు వెళ్లి ట్యూషన్లు చెప్పుకుంటూ, అలాగే ప్రవాస జర్మనీ కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొనేవాడు.ఈ లూపస్ కు పెళ్ళికాలేదు. ఇతని గురించి, ఇంత వివరంగా ఎందుకు అనుకోవాల్సి వస్తుంది అంటే,కొన్ని కారణాల వల్ల ఇతనికి మార్క్సు జీవితంలో ప్రధాన పాత్ర వుంది. ఒకటి ఏమిటంటే, ప్రస్తుత కథా కాలానికి మరో మూడు సంవత్సరాల తర్వాత మార్క్సు రాసిన అత్యంత, ప్రతిష్టాకరమైన ఉద్గ్రంథం”కేపిటల్” 1వ భాగాన్ని

ఈ లూపస్ కి అంకితమిచ్చాడు మార్క్స్. ఆ విధంగా లూపస్ చరిత్రలో నిలిచిపోయాడు. ఆ పుస్తకాన్ని అంకితమిస్తూ ఏం రాశాడంటే...

" టూ మై అన్ఫరగేటబుల్ ఫ్రెండ్ 'విల్ హెల్మ్ ఓల్ఫ్' ఇంటర్ పీట్ పెయిట్ఫుల్ నోబుల్ ప్రోటాగనీస్" అని రాశాడు.

1864 సమయానికి ఈ లూపస్ మాంచెస్టర్ లో ఉన్నాడని అనుకున్నాం కదా! అతనికి తీవ్రమైన అనారోగ్యం ఏదో చేసింది. డాక్టర్లు 2,3, వారాలు తీవ్రంగా ప్రయత్నం చేశారు అ జబ్బు తగ్గించడానికి. యెంత ప్రయత్నించినప్పటికీ కుదరలేదు.బ్రెయిన్ డేమేజ్ గానీ, బ్రెయిన్ ఫీవర్ గానీ అలాంటిది ఏదో అయ్యి, ఆ మాంచెస్టర్ లోనే కన్ను మూశాడు. అతనికి పెళ్ళికాలేదు. వెనకా ముందు కూడా ఎవరూ లేరు. అయితే, అతను జీవిత కాలంలో కూడా బెట్టుకున్న ఒక వెయ్యి పౌండ్ల గురించి తన వీలునామాలో ఏం రాశాడంటే..."తన వెయ్యి పౌండ్లలో ఒక వంద పౌండ్లు ఎంగెల్సుకీ, ఒక వంద పౌండ్లు తనకి వైద్యం చేసిన డాక్టర్ గారికీ, ఒక వంద పౌండ్లు ఒక జర్మన్ క్లబ్బుకీ మిగిలినదంతా కూడా మార్క్స్, జెన్నిలకు చెందేలా రాశాడు. అదే రోజుల్లో ఈ లూపస్ నుండి మరొక ఏడు వందల పౌండ్లు అదనంగా అందాయి.అంటే, తల్లి దగ్గర నుండి 7oo,లూపస్ నుండి 7oo. మొత్తం 14oo పౌండ్లు మార్క్స్ దగ్గరకు వచ్చాయి.

అది చాలా ఎక్కువ. కలలో కూడా ఊహించనటువంటి సంపద. ఇంక దానికి తోడుగా మార్క్స్ తన దగ్గర వున్న డబ్బులో నుండి కొంత స్టాక్ మార్కెట్ లో పెట్టుబడి పెట్టి, మరో రెండు మూడు వందలు సంపాదించానని బాబాయికి రాసిన వుత్తరం లో రాశాడు మొత్తంగా ఒక్కసారిగా మార్క్స్ ఆర్ధిక పరిస్థితి మెరుగుపడింది. దేనికీ వెనకాముందు చూడకుండా ఖర్చు చేయడానికి అవకాశం వచ్చింది. పిల్లలు కూడా అంత వరకూ తమ స్నేహితుల వద్దకు వెళ్ళడానికి కూడా భయపడేవారు. ఎందుకంటే, వాళ్ళ స్నేహితులు కాస్త వున్నవాళ్ళు, వీళ్ళు లేని వాళ్ళు. ఇప్పుడు పరిస్థితి అది కాదు. వాళ్ళతో కలసిపోయారు.

పిల్లందర్నీ తీసుకొని దగ్గరలోని సముద్ర తీర ప్రాంతం " రామ్స్ గేట్" అనే వూరు వెళ్లి, 2,3, వారాలు వుండి వచ్చాడు మార్క్స్. ఇంతకుముందు తన దగ్గర డబ్బులు లేని రోజుల్లో కూడా పిల్లల్ని సరదాగా బయటకు తీసుకు వెళ్ళేవాడు. కాకపొతే, అలా వెళ్ళేటప్పుడు ఆచి తూచి ఖర్చు పెట్టుకోవలసి వచ్చేది. జెన్ని వీళ్ళతో కాకుండా, వాళ్ళ స్నేహితులతో 2,3 వారాలు ఒక హాలిడే టూర్ లాంటిది వెళ్లి వచ్చింది. లోకం అంతా పచ్చగా,జీవితం రంగులమయంగా కనిపిస్తోంది ఆ కుటుంబ సభ్యులకు. చాలా సార్లు మిత్రులందర్నీ పిలిచి పెద్ద ఎత్తున విందులు ఇచ్చాడు కొత్త ఇంట్లో.

వీళ్ళు ఇక్కడ ఇలా వుండగా, అక్కడ మాంచెస్టర్ లో ఎంగెల్సు వున్నాడు కదా! అతను చేస్తున్నటువంటి కంపెనీకి పూర్తి స్థాయి భాగస్వామి అయ్యాడు.ఆ కంపెనీ కూడా కొద్ది కొద్దిగా లాభాల బాట పట్టడం మొదలు పెట్టింది. ఎంగెల్సుతో ఇరవై సంవత్సరాలు సహజీవనం చేసిన ఐరిష్ యువతి 'మేరీ' మరణించిందని గతంలో తెలుసుకున్నాం.ఆ మేరీ చెల్లెలు పేరు 'లిజి'.ఆమె కూడా చాలా రోజులుగా ఎంగెల్సు వాళ్ళ ఇంట్లోనే వుంటుండేది. మేరీ చనిపోయిన కొన్ని రోజులకి ఈ

'లిజి' ని తన భార్యగా అందరికీ పరిచయం చేశాడు ఎంగెల్సు.వాళ్ళు కూడా అక్కడ మాంచెస్టర్లో ఒక పెద్ద ఇంటికి మారారు. అప్పట్లో మార్క్స్ కి సహాయం చేసే అవసరం కూడా తగ్గింది.ఈ పరిస్థితి అంతా సవ్యంగా జరిగిపోయివుంటే, మార్క్స్, జెన్నీ ల ఆర్థికస్థితి ఒక క్రమ పద్ధతిలో నడచి వుంటే..వున్న 15, 16 వందల పౌండ్లతో కనీసం 6, 7 సంవత్సరాలు ఏ ఇబ్బంది లేకుండా, సౌకర్యవంతంగా జీవించవచ్చు.

అయితే మార్క్స్‌కి పేదరికాన్ని వదలాలని లేదో, లేకపోతే పేదరికానికే మార్క్స్‌ని వదలాలని లేదో తెలియదు గానీ, మార్క్స్ కుటుంబానికి ఈ సౌకర్యవంతమైన జీవనశైలి ఎక్కువ కాలం కొనసాగలేదు. చాలా ఆశ్చర్యంగా వుంటుంది. ఏమైందో ఏమిటో కథా క్రమంలో తెలుసుకుందాం.

ప్రస్తుతానికి మనం 1864 లో వున్నాం. ఒక్కసారిగా ఆర్థిక ఇబ్బందులూ, అప్పుల వాళ్ళ బెదిరింపులూ ఆగిపోయేసరికి, మార్క్స్ రెట్టించిన ఉత్సాహంతో లండన్ లోని ప్రవాస జర్మన్ల రాజకీయ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం ప్రారంభించాడు. అప్పటికే కొందరు కార్యకర్తలు"ఇంటర్నేషనల్ వర్కింగ్ మెన్స్ అసోషియేషన్ [ I.W.M.A]" అనే ఒక సంస్థను ప్రారంభించారు.మార్క్స్ ఆ సంస్థలో ప్రవేశించి,చాలా తొందర్లోనే ఆ సంస్థలో అత్యంత కీలకమైన స్థానానికి ఎన్నికయ్యాడు. ఆ తరువాత 5,6, సంవత్సరాల పాటు (ఈ i.w.m.a. సంస్థనే "ఫస్ట్ ఇంటర్నేషనల్ "అని కూడా అంటారు.) ఆ సంస్థ ద్వారా ముందు యూరప్ లోనీ, తర్వాత ఇతర దేశాల్లోని కార్మికులనందరినీ ఒక తాటి మీదకు తీసుకురావడానికి చాలా ప్రయత్నాలు జరిగాయి. దాంట్లో మార్క్స్ చాలా కీలకమైన పాత్ర పోషించాడు. అదే ఉత్సాహంతో తానూ ఆపేస్తూ వస్తున్న 'కేపిటల్ 'పుస్తకాన్ని పూర్తి చేసే పనిలో పడ్డాడు.

ఆయన ఈ పుస్తకాలు రాయడానికీ, పరిశీలనా గ్రంధాలు రాయడానికీ 'బ్రిటీష్ మ్యుజియం'కి వెళ్ళేవాడని చెప్పుకున్నాం కదా! అక్కడకు వెళ్ళేటప్పుడు తన రెండో అమ్మాయి 'లారా' ని కూడా తనతో పాటు తీసుకువెళ్ళేవాడు. అప్పటికి ఆమె వయసు 19 సంవత్సరాలు. తల్లి లాగా అద్భుత సౌందర్య రాశి. ఆ వయసులో ఆమెను చూసి చాలామంది తమ ప్రేమను వ్యక్తం చేస్తుండేవారు. ఆమెకు దగ్గరవ్వాలని రకరకాలుగా ప్రయత్నిస్తుండేవారు ఆమె తండ్రితో కలసి లైబ్రరీ కి వెళ్ళే రోజుల్లో. ఎవ్వరినీ దగ్గరకు రానిచ్చేది కాదు. ఎవ్వరితోనూ చనువుగా కూడా వుండేది కాదు. అలా 1864 వ సంవత్సరం సుఖంగానూ, తీరిక లేకుండానూ గడచిపోయింది.1865 వచ్చింది.ఆ సంవత్సరం ఫిబ్రవరిలో ఆడపిల్లలు ముగ్గురూ కలసి, వాళ్ళ అమ్మ జెన్నీకి పుట్టిన రోజుని అత్యంత ఘనంగా జరిపారు.

మార్క్స్ చురుగ్గా ఉన్నటు వంటి ఫస్ట్ ఇంటర్నేషనల్ సంస్థ చాలా విస్తరించింది. కేవలం ఇంగ్లాండ్ లోనే 12 వేల మంది సభ్యులయ్యారు.దాని కార్యకలాపాల్లో ఊపిరి సలపకుండా అయిపోయాడు మార్క్స్. సాయంత్రం కార్యకర్తలు వాళ్ళ ఇంటికి వస్తే,అప్పుడు సమావేశాలు మొదలు పెడితే, చాలా సార్లు తెల్లవారే వరకూ వాళ్ళ ఇల్లు ఒక రాజకీయ పాఠశాల లాగ వుండేది.అదే సమయంలో జర్మనీలో ఉన్నటువంటి పబ్లిషర్ 'కేపిటల్ 'పుస్తకాన్ని రెండు నెలల్లో ఇచ్చేస్తే, 1865

అక్టోబర్ కల్లా అచ్చువేసి ఇస్తానని అన్నాడు. ఈ పనులన్నీ సర్దుకోవడానికని మార్క్స్ , పెద్దమ్మాయి చెన్ ని 'ఫస్ట్ ఇంటర్నేషనల్' పనులు చూడ్డానికి సెక్రటరీగా పెట్టుకున్నాడు. చిన్నమ్మాయి 'లారా'ని తన కేపిటల్ పూర్తి చేయడానికి అవసరమైన పుస్తకాలు చదవడం, సమాచారాలు సేకరించడం లాంటి పనులు అప్పగించాడు. యెంత తీరిక లేకుండా, తీవ్రంగా పని చేస్తున్నప్పటికీ, ఆ పబ్లిషర్ అడిగిన 2,3 నెలల్లో పుస్తకం అందించలేకపోయాడు.

అందువల్ల పబ్లిషర్ కి "ఇంకో 3,4 నెలలు పడుతుంది.1865 సెప్టెంబర్ కి ఇస్తాను "అని కబురు చేశాడు. ఇంట ఒత్తిడికి గురయ్యేసరికి అసలే అంతంత మాత్రంగా వున్నా మార్క్స ఆరోగ్యం, మళ్ళీ దిగజారడం మొదలుపెట్టింది. ఒంటి మీద ఎక్కడ బడితే అక్కడ పుళ్ళు రావడం, అవి పెరిగి పెద్దవయి తీవ్రమైనటు వంటి అసౌకర్యం. ఆరోజుల్లో ఒకసారి ఎంగెల్సు కి ఉత్తరం రాశాడు.

"ఈ పుస్తకం రాయడానికి అడ్డ గాడిదలాగా రాత్రీ పగలు శ్రమిస్తున్నాను. ఎప్పుడన్నా విశ్రాంతి కావాలనుకుంటే, డిఫరెన్షియల్ కాలిక్యులేషన్ లెక్కలు చేస్తున్నాను."అని రాశాడు. జెన్నీకూడా ఎంగెల్సుకి మరో వైపు వుత్తరం రాసింది. "మీరైనా చెప్పండి. ఆయన పని చేసే పద్ధతి చూస్తుంటే, ఈ పెద్దమనిషి ఆరోగ్యం గురించి చాలా భయం వేస్తుంది.భరించలేని బాధ వలన దాదాపు 2,3 వారాలుగా అసలు నిద్రపోవడం లేదు. మిత్రుడే కదా! మీరైనా చెప్పండి."అని రాసింది.

అయితే, మార్క్స ఆరోగ్యం దిగజారడానికీ, అంతగా మానసిక ఒత్తిడికి కారణం ఆ పుస్తకం ఒక్కటే కారణం కాదు. 1865 జూలైలో ఎంగెల్సు కి రాసిన వుత్తరం లో ఆయన అసలు నిజాన్ని బయట పెట్టాడు. అదేమిటంటే.."ఏడాదిన్నర క్రితం అమ్మ దగ్గర నుండి తెచ్చిన డబ్బులూ, లూపస్ ఇచ్చినటు వంటి డబ్బులూ మొత్తం ఖర్చు అయిపోయాయి. నాకు తెలుసు నువ్వు అప్సెట్ అవుతావని.కానీ, ఇది నిజం. వెనక్కి తిరిగి చూసుకుంటే,ఈ ఏడాదిన్నర కాలంలో మేం పెట్టిన ఖర్చులూ, ఇంట్లో సామన్లకే జెన్నీ4,5 వందలు ఖర్చు పెట్టింది. పైగా మా దగ్గరకు డబ్బులు వున్నాయని తెలిసి, ఎప్పుడో 15ఏళ్ళ క్రితం జర్మనీలో, బెల్జియంలో అప్పులు ఇచ్చిన వాళ్ళు కూడా వాళ్ళ ఏజెంట్లని లండన్ పంపించి నా దగ్గర ముక్కు పిండి వసూలు చేసుకున్నారు. పిల్లలు కూడా బాగానే ఖర్చు చేశారు. ఏదైతేనేం మొత్తం 15,16 వందల పౌండ్లు ఖర్చయిపోయి, మళ్ళీ అప్పు చేస్తున్నాను. నిజానికి నీకు ఇలా వుత్తరం రాయడం కంటే, బొటనవేలు కోసేసుకుందాం అనిపిస్తోంది. నా జీవితంలో అధిక భాగం ఒకరి మీదనే ఆధారపడి బ్రతుకుతున్నాను..అనే భావం అపరాధంగా అనిపిస్తోంది.అయినా మనిద్దరి భాగస్వామ్యం లో మరెంతో సాధించాలి' అన్నఆశే, నీ ముందు అన్నీ చెప్పుకునేలా చేస్తుంది. పిల్లలు పుట్టిన దగ్గర నుండి సౌకర్యవంతమైన జీవితం అంటే ఏమిటో ఎరగరు. ఈ కొద్దిగా ఏడాదిన్నర కాలమే అయినప్పటికీ, వాళ్లకి కాస్త సుఖవంతమైన జీవితాన్ని ఇవ్వగలిగానన్న తృప్తి ఒక్కటే నాకు మిగిలింది. కనీసం వాళ్ళు

మగపిల్ల లైనా,లేదా అసలు పిల్లలు లేకపోయినా ఇన్ని బాధలు ఉండేవి కాదేమోననిపిస్తోంది.”అని అతి దీనాతి దీనంగా వుత్తరం రాశాడు మార్క్స్.

ఆ విధంగా ఏడాదిన్నర కాలంలో మొత్తం వచ్చిన డబ్బులన్నీ ఖర్చయిపోయాయి. కనీసం ‘కేపిటల్’ పుస్తకం పూర్తయితే, కొంత ఆదాయం వస్తుంది.అన్న ఆశ ఒక్కటే, చీకట్లో చిరుదీపం లాగా కనిపిస్తోంది మార్క్సుకు. మరి దాన్ని తొందరగా పూర్తి చేయాలంటే ఈ ‘ఫస్ట్ ఇంటర్నేషనల్’ సంస్థ కార్య కలాపాల్లో వున్నాడు కదా! అందుకని ఆ సంస్థ వాళ్ళతో ఏం చెప్పాడంటే,..“ నేను కొన్ని నెలల పాటు లండన్ లో వుండడం లేదు.బయటకు వెళుతున్నాను. మా ఇంటికి రావద్దు.” అని అబద్ధం చెప్పి, ఇంట్లో కూర్చొని ‘కేపిటల్’ పుస్తకం పూర్తి చేసేపనిలో పడ్డాడు. ఎలాగైనా ఆ పుస్తకం పని పూర్తి చేయాలనిఅనుకుంటున్న సమయం లోనే ఇల్లంతా ఆసుపత్రి లాగా తయారయ్యింది. అందరికీ ఒకే వరసలో అనారోగ్యాలు.పిల్లలిద్దరికీ తీవ్రమన దగ్గూ, జ్వరం. చివరి అమ్మాయికి మశూచి సూచనలు. జెన్నీకి ముందు పళ్ళు తీసేయ్యడమూ ఇలా అంతా గందరగోళంగా తయారయ్యింది. ఈలోగా ఫస్ట్ ఇంటర్నేషనల్ వారికి తెలిసింది. ‘ఇతను ఎక్కడకీ వెళ్ళలేదు.ఇంట్లోనే వున్నాడు’ అని. వాళ్ళు వచ్చి మళ్ళీ సంస్థ కార్యక్రమాలకు రమ్మనమని అనడం మొదలుపెట్టారు.

1866 జనవరి వచ్చింది. అప్పటికి 12oo పేజీలు పూర్తి చేశాడు.భార్యా, పెద్దమ్మాయి కలసి ఆ పేజీలను ఫెయిర్ చేశారు. మళ్ళీ మార్క్సుకి ఒళ్ళంతా పుళ్ళూ, కూర్చో లేడూ, పడుకోలేడూ. ఆయన జీవితం రణరంగం. శరీరం మరో వ్రణరంగం. 1866 ఫిబ్రవరి వచ్చింది. పుస్తకం పబ్లిషర్ కి పంపిద్దామని ఎంగెల్సు అడుగుతుంటే మరో బాంబు లాంటి వార్త చెప్పాడు మార్క్స్.

“నేను ఇంతవరకూ రాసిన కేపిటల్ పుస్తకంలో చాలా మార్పులు చెయ్యాలనిపిస్తోంది. ఇలా ప్రింటింగ్ కి ఇవ్వలేను. ఎందుకంటే, నేను ఇది రాస్తున్నటువంటి ఈ 4,5 ఏళ్ళలో ప్రపంచవ్యాపితంగా వస్తున్న సామాజిక,ఆర్థిక మార్పుల్ని పరిగణలోకి తీసుకుని, చాలా వాటిని తిరగరాయాల్సి వుంటుంది.అలాగే జర్మనీ, ఫ్రాన్సు దేశాలలో వచ్చినటువంటి “ఎగ్రికల్చరర్ కెమిస్ట్రీ “మార్పుల్ని కూడా అధ్యయనం చెయ్యాలి. కౌలు దారి విధానంలో వచ్చిన మార్పుల్ని పరిశీలించాలి.అలాగే జపాన్ లో వచ్చినటువంటి కొన్ని సంఘటనల్ని కూడా పరిశీలించాలి. అలా మార్పులు చెయ్యాలంటే, నేను పర్యటన పుస్తకాలు చదవాలి.అందుచేత మరో 3, 4 నెలలు ఆలస్యమవుతుంది “అని చెప్పాడు.

మళ్ళీ డాక్టర్లూ, మందులూ మార్క్సు శరీరం ఒక ప్రయోగశాల లాగ అయిపోయింది. గతంలో పుస్తకం విషయంలో ఎంగెల్సు ఒత్తిడి చేస్తుండేవాడు. ఈసారి మాత్రం “అయిన ఆలస్యం ఎలాగూ అయింది. పబ్లిషర్ కి నేనేదో చెబుతాను. ప్రస్తుతానికి నువ్వు ఆ పుస్తకం పని ఆపేసి, ఆరోగ్యం చూసుకో. ఇంటికి అవసరమైన డబ్బులు నేను

పంపిస్తాను.నువ్వు అర్జంటుగా చల్లగా వుండే సముద్ర తీర ప్రాంతానికి వెళ్లి,అక్కడ ఆరోగ్యం బాగు చేసుకో"అని ఎంగెల్సు, మార్క్సుకి జవాబు రాశాడు.

ఎంగెల్సు చెప్పిన మాట మీదా, చేసిన సహాయం తోటీ 1866 మర్చి 15వ తేదిన "మార్ గేట్" అని ఒక సముద్రతీర ప్రాంతానికి వెళ్లి, అక్కడ కొన్ని వారాలు వుండి,ఆరోగ్యం కాస్త కుదుటపడింది అనుకున్నాక లండన్ వచ్చాడు.

ఇప్పటికే పబ్లిషర్ కి వాగ్దానం చేసిన సమయం కంటే,సంవత్సరం పాటు ఆలస్యం అయింది. అయినా ఇంకా పూర్తి కాలేదు. ఎన్నాళ్ళు పడుతుందో మార్క్సుకే తెలియదు. ఇలా నడుస్తూ వుండగా మార్క్సు వ్యక్తిగత జీవితంలోని మరి కొన్ని సంఘటనల గురించి అనుకోవాలి.

ఆ రోజుల్లో ఫ్రాన్సు నుండి ఇద్దరు కుర్రవాళ్ళు వచ్చి మార్క్సు ను కలుసుకున్నారు. వాళ్ళ పేర్లు ఒకవ్యక్తి పేరు చార్లెస్ లాంగెట్. క్లుప్తంగా 'చార్లెస్' అందాం. ఈ చార్లెస్ వయసు 26 సంవత్సరాలు. ఫ్రాన్సులో బాగా ధనవంతుల కుటుంబానికి చెందినటువంటి వాడు. కాలేజిలో 'లా' చదువుతూ ఉండేవాడు. 'లా' చదువుతున్నప్పుడే రాజకీయాల్లోకి వెళ్లి, చదువు మధ్యలో మానేసి రాడికల్ జర్నలిజం వైపు వెళ్ళాడు."లెఫ్ట్ బ్యాంకు "అనే పత్రిక ఒకటి ప్రారంభించి,అతను రాసేటటువంటి తీవ్రవాద వ్యాసాల వలన 4 నెలలు జైలు శిక్ష కూడా అనుభవించాడు.తను నడిపే పత్రికలో గతంలో మార్క్సు రాసినటువంటి వ్యాసాల్ని ఫ్రెంచ్ భాషలోకి అనువాదం ప్రచురిస్తూ ఉండేవాడు.

మరొక వ్యక్తి పేరు "పాల్ లఫార్గే" సౌలభ్యం కోసం"పాల్ " అని పిలుచుకుందాం.ఇతను చార్లెస్ కంటే, ధనవంతుల కుటుంబం నుండి వచ్చిన వాడు. వయసు 23 సంవత్సరాలు.వాళ్ళ నాన్నగారికి 5,6 దేశాల్లో 'వైనరీస్ 'వున్నాయి. పారిస్ లో మెడిసన్ చదువుతూ ఉండేవాడు. కాకపొతే, చదువుకున్న రోజుల్లోనే రాజకీయ కార్యకలాపాల్లో ఎక్కువగా పాల్గొనే వాడు. ముఖ్యంగా 'ఫస్ట్ ఇంటర్నేషనల్ ' లో చాలా చురుకుగా పాల్గొనేవాడు. దాంతోటి కాలేజి యాజమాన్యంఅతన్ని రెండేళ్ళ పాటు మెడికల్ కాలేజి నుండి బహిష్కరించింది. అప్పుడు వాళ్ళ నాన్న ఏమన్నాడంటే..

"సరే! ఈ రెండేళ్ళూ లండన్ వెళ్లి అక్కడ ఏవైనా ఈ మెడికల్ కు సంబంధించిన కోర్సులు చేసి, మళ్ళీ ఫ్రాన్స్ వచ్చి, మిగతా చదువు కొనసాగించ వచ్చు"అని ఈ పాల్ ని లండన్ పంపించాడు. పాల్ అప్పటికే మార్క్సు వ్యాసాలు చదివి వున్నాడు. ముఖ్యంగా i.w.m.a.సంస్థ ద్వారా పరోక్షంగా మార్క్సుతో కూడా కొద్దిగా పరిచయం వుంది. కాబట్టి,అదే రోజుల్లో మార్క్సు ని కలుసుకోవడానికి ఇంటికి వెళ్ళాడు.

ఈ మొదటి కుర్రాడు చార్లెస్ కీ,రెండో కుర్రాడు పాల్ కీ వీళ్ళిద్దరికీ పారిస్ లోనే కొద్దిగా పరిచయం వుంది గానీ, పెద్దగా చనువు లేదు. ఈ ఇద్దరి గురించి ఎందుకు ఇంత వివరంగా అనుకోవలసి వచ్చింది అంటే..ఈ చార్లెస్ అనే కుర్రవాడు ఏడేళ్ళ తరవాత మార్క్సుకి పెద్ద అల్లుడయ్యాడు. ఈ పాల్ రెండో అల్లుడయ్యాడు. అయితే, ఈ వివాహాలూ, నిశ్చితార్థాల వెనుక చాలా కథ వుంది. ఈ 21వ శతాబ్దంలో మనకు బాగా తెలిసిన భారతీయ సమాజంలో ముగ్గురు

ఆడపిల్లల మధ్యతరగతి తండ్రి, తన కూతుర్లకు పెళ్లి చేసేటందుకు అనుభవాలు ఎదురవుతాయో, 15oఏళ్ళ క్రితం కార్ల్ మార్క్స్ కు అన్ని అనుభవాలూ ఎదురయ్యాయి. వాటి గురించి క్లుప్తంగా తెలుసుకుంటూ ముందుకు వెళదాం.

లండన్ వచ్చాక ఈ చార్లెస్, పాల్ ఇద్దరూ కూడా మార్క్స్ నడుపుతున్న i,w.m.a.సంస్థలో క్రియాశీలక సభ్యులుగా చేరారు.ఆ కార్యక్రమాల గురించి తెలుసుకోవడానికి తరచూ మార్క్స్ ఇంటికి వస్తుండేవారు. మొదట్లో ఆ రావడం అనేదిమార్క్స్ తో మాట్లాడడానికే అయినప్పటికీ, తొందరలోనేఆ ఇంట్లో వున్న ఆడపిల్లల ఆకర్షణ నుండి తప్పించుకోలేకపోయారు. ఈ చార్లెస్ కు మార్క్స్ పెద్దమ్మాయి చెన్ అంటేనూ, పాల్ కి చిన్నమ్మాయి లారా అంటేనూ ఇష్టం ఏర్పడింది. చార్లెస్ కి రాజకీయాలే ప్రధానం కాబట్టి, తన ప్రేమను వెంటనే చెప్పలేకపోయాడు. ఈ పాల్ అయితే, మెడిసన్ కోర్సులు పూర్తి చేస్తూ, సంస్థ కార్యక్రమాల్లో ఎక్కువ కాలం గడుపుతూ ఈ లారా పట్ల తనకు వున్న ప్రేమను యెంత తొందరగా చెబుదామా? అన్నట్లుగా ప్రవర్తించేవాడు. ఈ కుర్రవాళ్ళిద్దరూ ఆడపిల్లలతో కలివిడిగా మాట్లాడడం, ఆడపిల్లలు కూడా వాల్లతో కలిసి కబుర్లు చెప్పడం ఇవన్నీ కూడా వాళ్ళ అమ్మ జెన్నికి నచ్చలేదు.

ఆమె తన మిత్రురాలికి రాసిన ఉత్తరంలో ఇలా రాసింది " మధ్య నేను, పిల్లలతో తరచూ చిరాగ్గా ఉంటున్నాను, నా బాధ వాళ్ళకు అర్థం కావడం లేదు. రాజకీయాలే జీవితం అనుకున్న వ్యక్తిని చేసుకుని, గత 2o ఏళ్ళుగా నేను అనుభవిస్తున్న దుర్భర దారిద్ర్యం నీకు తెలుసు. దాంట్లోనే బాధలు పడుతూ పెరిగిన మా అమ్మాయిలు, వాళ్ళు కూడా పెళ్ళయిన తర్వాత ఇలాగే కొనసాగడం నాకు ఇష్టం లేదు. అటు చూస్తే ఆ కుర్రాళ్ళు ఇద్దరూ కూడా రాజకీయాల్లోనే మునిగి తేలుతున్నారు. వాళ్లకు భార్యలుగా వీళ్ళు వెళితే,నా కూతుర్ల జీవితం కూడా నాలాగే అవుతుందేమో భయంగా వుంది "అని రాసింది. ఆడ పిల్లల తల్లిగా జెన్నీని అర్థం చేసుకోవచ్చు.

అయితే, ఈ విషయంలో మార్క్స్ స్పందన ఎలా వుంది అన్నది ప్రశ్న. ఆశ్చర్యకరంగా మార్క్స్ కూడా జెన్నీనే అభిప్రాయాలనే సమర్థించాడు. అదే సమయంలో పెద్దమ్మాయి చెన్ ను ఇష్టపడుతున్న చార్లెస్, ఫ్రాన్సు వెళితే, అక్కడ అతన్ని అరెస్ట్ చేసి 8 నెలలు జైలు శిక్ష వేసి, జైల్లో పెట్టారు. అలా తాత్కాలికంగా పెద్దమ్మాయి సమస్య వాయిదా పడింది. అదలా వుంటే, ఇక లారా, పాల్ ల మధ్య స్నేహం మాత్రం రోజురోజుకీ బలపడుతోంది. ఒక రోజు ఆ కుర్రవాడిని పిలిచి మార్క్స్ స్పష్టంగా చెప్పాడు.

"చూడబ్బాయ్! నువ్వు ఈ i.w.m.a.పనులన్నీ బాగానే చేస్తున్నావు. ఆ విషయంలో నిన్ను ఖచ్చితంగా అభినందిస్తున్నాను. ఇక రెండోది,మా అమ్మాయి 'లారా' విషయం. నువ్వు నాకు ప్రత్యేకంగా చెప్పక పోయినా రోజురోజుకీ మీ మధ్య చనువు గమనిస్తే తెలుస్తుంది. అయితే, నువ్వు మా అమ్మాయిని పెళ్లి చేసుకోవాలంటే, ఒక విషయం గుర్తు పెట్టుకో.నాలాగ ఇలాగే రాజకీయాల్లో కొనసాగుతానంటే, నేనూ, జెన్ని ఇద్దరమూ ఒప్పుకోవడానికి సిద్దంగా లేము. ఈ రాజకీయాలతో నా జీవితం దుర్భరం చేసుకున్నాను.అయితే, దీనికి నేనేమి పశ్చాత్తాప పడడం లేదు. బహుశా మళ్ళీ

జీవితాన్ని మొదటినుండి ప్రారంభించే అవకాశం వచ్చినప్పటికీ, మళ్ళీ ఇదే పని చేస్తాను. కాకపోతే, అప్పుడు పెళ్లి మాత్రం చేసుకోను. నా సిద్ధాంతాలతో నా పిల్లల జీవితాలను దారిద్ర్యమయం చేశాను. నువ్వూ ఇలాగే కొనసాగడం మాత్రం నాకు ఇష్టం లేదు.నువ్వు ఏ విధంగా మా అమ్మాయి బ్రతుక్కి బరోసా ఇస్తావో చెప్పు. అప్పుడు మీ పెళ్లి గురించి ఆలోచిద్దాం" అన్నాడు.

నిజానికి మార్క్స్ పిల్లలు జెన్ని చెన్,లారా చాలా సమర్థత, తెలివితేటలు వున్న పిల్లలు. వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడే లక్షణాలు వున్నాయి. కానీ, మార్క్స్,జెన్ని లు మాత్రం, వాళ్ళను స్వతంత్రంగా జీవించే అమ్మాయిల్లాగా కాకుండా, 'ఎవరో వచ్చి వాళ్ళను పెళ్లి చేసుకుంటారు.ఆ వచ్చేవాళ్ళు వీళ్ళను జాగ్రత్తగా చూసుకోవాలి.' అనే ఆలోచనతో వుండేవారు. ఆ ఆలోచనల వల్లనే లారా ను ఇష్టపడే అబ్బాయికి అలా చెప్పాడు. ఆ మాటలు విన్నాక పాల్ ఏం చేశాడంటే,ఫ్రాన్సు నుండి బాగా పేరున్నటువంటి ఒక డాక్టర్ గారితో ఫోన్ చేయించాడు."ఈ పాల్ చాలా మంచివాడు. చాల సమర్ధుడు."అని ఒక సర్టిఫికేట్ ఇస్తున్నట్టుగా ఉత్తరం రాశాడు.

అదే సమయంలో పాల్ నాన్న కూడా మార్క్స్ కి ఒక వుత్తరం రాశాడు.మా అబ్బాయి చెప్పాడు. మీ అమ్మాయిని తను ఇష్టపడుతున్నానని చెప్పాడు. మీకు వున్న సందేహాలు కూడా చెప్పాడు. మా వాడు మీ ఇంటి అల్లుడైతే చాలు అనుకుంటున్నాము.మా తరపు నుండి మా అబ్బాయికి 4 వేల పౌండ్లు ఇస్తాను.దాంతో వాళ్ళిద్దరూ గౌరవప్రదమైన వైవాహిక జీవితాన్ని గడపవచ్చు."అని హామీ ఇస్తూ వుత్తరం రాసాడు పాల్ వాళ్ళ నాన్న.

ఇన్ని పరిణామాలు జరిగాక 'పరవాలేదు ఆ అబ్బాయితో లారా పెళ్లి జరిగితే సుఖం గానే వుంటుంది ' అన్న నమ్మకం కలిగింది. 1866 సెప్టెంబర్ 26 న వాళ్ళిద్దరికీ నిశ్చితార్థం జరిగింది. పెద్దమ్మాయి గురించిన ప్రస్తావన రాలేదు. ఎందుకంటే,ఆ అబ్బాయి అక్కడ జైల్లో వున్నాడు.

నిశ్చితార్థం అయితే, జరిగింది. కానీ, పెళ్లి మాత్రం 2 సంవత్సరాల తర్వాత చేద్దాం అనుకున్నారు. గతంలో మార్క్స్, జెన్ని ల విషయంలో కూడా అదే జరిగింది. నిశ్చితార్థం జరిగిన 6,7 సంవత్సరాలకి పెళ్లి జరిగింది. ఈ నిశ్చితార్థం జరిగాక పాల్, మార్క్స్ కు ఇంటికి దగ్గర లోనే ఒక ఇల్లు అద్దెకి తీసుకున్నాడు. అయితే, రోజులో చాలా సేపు మార్క్స్ ఇంట్లోనే ఉండిపోయేవాడు. ఇంత వరకూ బాగానే వుంది. ఇక్కడ ఒక విచిత్రమైన సమస్య వచ్చింది.మార్క్స్ 1865 లోనే అప్పుల ఊబిలో చిక్కుకున్నాడు అనుకున్నాం కదా! ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న కాలం 1866 సెప్టెంబర్ నాటికి ఒక సంవత్సరం పైగా ఆర్థిక ఇబ్బందుల్లో వున్నాడు. ఇప్పుడు కాబోయే అల్లుడు ఎప్పుడూ ఇంట్లోనే ఉంటున్నాడు. అందువల్ల తన పేదరికాన్ని కప్పిపుచ్చుకోవడానికీ, తరచూ వచ్చి తలుపులు కొట్టే అప్పుల వారి నుండి చాలా ప్రయత్నాలు చేస్తుండేవాడు.ఒక్కోసారి అప్పుల వాళ్ళు తలుపులు కొడితే,ఈయన వెనకాతల దొడ్డి తలుపు గుండా వెళ్లి, వాళ్లకి సమాధానం చెప్పి పంపిస్తుండేవాడు.

మళ్ళీ మామూలే ఎంగెల్సుకి ఉత్తరాలు రాస్తుండేవాడు. ఆయన అవసరమైన సహాయం చేయడం, కాబోయే అల్లుడి ముందు పరువు కాపాడుకోవడం, ఇలా జరుగుతూనే వుంది. 1866 కూడా గడచింది. పూర్తవుతూ, పూర్తవుతూ వస్తున్న ఆ 'కేపిటల్ ' పుస్తకం నిజంగానే పూర్తయింది. 1866 నవంబర్ లో ఆ పుస్తకంలోని కొన్ని పేజీలు జర్మనీ లోని పబ్లిషర్ కి పోస్ట్ చేశాడు. ఎంగెల్సు చాలా ఆశ్చర్యపోయాడు.ఇంత తొందరగా పూర్తి చేసాడా అని. ఆ పబ్లిషర్ అన్నాడు " మిగతా పేజీలు పట్టుకుని మీరు జర్మనీ రండి. ఇక్కడ కూర్చొని ప్రూఫ్ రీడింగ్ చేద్దురు.నేను మీకు పంపించడం, మీరు నాకు పంపించడం ఎందుకు? అలాయితే, ఆలస్యం అవుతుంది "అని రాశాడు. ఇదంతా 1867 ఏప్రెల్ లో జరిగింది. ఎంగెల్సు కూడా "అదే మంచిది. జర్మనీ వెళ్ళు." అన్నాడు.

అప్పుడు మార్క్సు, ఎంగెల్సుకి ఒక వుత్తరం రాశాడు. " నీ సూచన అయితే బాగానే వుంది. అసలు విషయం నాకు చెప్పడానికి సిగ్గుగా వుంది. నా బట్టలూ, వాచీ కూడా తాకట్టు లో వున్నాయి. అందుకని బయటకు కూడా వెళ్ళలేకపోతున్నాను." ఎంగెల్సుకి ఇదంతా అలవాటైన విషయమే కాబట్టి, మళ్ళీ డబ్బులు పంపించాడు. 1867 ఏప్రెల్ 2oన బయలుదేరి జర్మనీ వెళ్ళాడు. అక్కడకు వెళ్లి అతనికి తెలిసిన డాక్టర్ వుంటే, ఆయన ఇంట్లో వుండి, ఈ 'కేపిటల్ 'పుస్తకం యొక్క అచ్చు అయినటు వంటి పేపర్లు ప్రూఫ్ రీడింగు పనిని మొదట విడత పూర్తి చేసి, 1867 మే 19న తిరిగి లండన్ వచ్చాడు.

ఆ తరువాత మరో మూడు నెలల పాటు ఈ ప్రూఫ్ రీడింగు కాగితాలు రావడం, ఈయన దిద్ది పంపించడం జరుగుతూనే వుంది. ఇక 'కేపిటల్ –1" వాల్యూం ప్రింటింగు పూర్తయి, మార్కెట్ లోకి రావడం ఒకటే మిగిలివుంది. పుస్తకం కోసం ఎదురుచూడడం ప్రారంభించారు. కేవలం ఎదురు చూడ్డం మాత్రమే కాదు. 'ఇది ఖచ్చితంగా బూర్జువాల మెదళ్లలో పెద్ద విస్ఫోటనం స్రుష్టిస్తుందని. ఇది బ్రహ్మాండంగా అమ్ముడుపోయి,మార్క్సు కి బోలెడు ఆదాయం వస్తుంది. అంతేకాదు ఇంగ్లీష్, ఫ్రెంచ్ బాషల్లోకి అనువాదం అయితే, మరింత ఆదాయం వచ్చి,దశాబ్దాల తరబడి మార్క్సుని వేదిస్తున్న పేదరికానికి ఇక చెల్లు చీటి' అనుకున్నారు. చాలా ధీమాగా, ఆత్మవిశ్వాసంతో వున్నారు ముగ్గురూ. మరి వాళ్ళ అంచనాలు నిజం అయ్యాయా? కేపిటల్–1 జర్మన్ భాష లో అయినపుడు సంచలనం సృష్టించిందా? వాస్తవంలో ఏం జరిగిందో తెలుసుకుందాం.

1867 సెప్టెంబర్ 14 వ తేది. 15o సంవత్సరాల తర్వాత ఈ రోజుల్లో కూడా కొన్ని మిలియన్ల మందికి పఠనాంశం గానూ, కొన్ని మిలియన్ల మందికి విమర్శాత్మకం గానూ, అయిన 'కేపిటల్'–1 మొట్ట మొదటిసారిగా జర్మన్ మార్కెట్లోకి వచ్చింది. తొలి విడతగా వెయ్యి కాపీలు విడుదలయ్యాయి. లండన్ లో వున్న మార్క్సు అభిమానులు ఈ 'కేపిటల్' విడుదలను భారీ ఎత్తున ఏమీ సెలబ్రేట్ చెయ్యలేదు. వాళ్ళు ఏమనుకున్నారంటే.."మార్కెట్లో విడుదలయ్యాక, అందరూ చదివాక, దాని స్పందన చూసాక, అప్పుడు పండగ జరుపుకుందాం" అనుకున్నారు. అసలు ఈ 'కేపిటల్'

పుస్తకం విడుదల గురించి యూరప్ లోనూ, మిగతా దేశాల్లోనూ తెలియాలంటే, పత్రికల్లో పరిచయాలు రావాలి. సమీక్షలు రావాలి.వేరే ఎవరో రాస్తారు అని ఎదురుచూసే బదులు తామే ఆ పనికి పూనుకుందామని అనుకున్నారు. మార్క్స్ అనుచర బృందం అంతా.

ఇలా వుండగా మార్క్స్ చిన్నమ్మాయి లారా, ఆమె కాబోయే భర్త పాల్ ఇద్దరూ కలసి కేపిటల్ పరిచయం వున్నా అధ్యాయాన్ని ఫ్రెంచిలోకి అనువాదం చెయ్యడం ప్రారంభించారు. మార్క్స్, అక్కడ పారిస్ లో ఉన్న పత్రికలకు పంపిద్దామని భార్య జెన్నీ, చెన్,మార్క్స్ ముగ్గురూ కూడా వాళ్లకు తెలిసిన వాళ్ళకు జర్మనీ, స్విర్జలాండ్,బెల్జియం, అమెరికా వున్న పరిచయస్తులకు ఈ పుస్తకం గురించి రాస్తూ, “వీటి సమీక్షల కోసమూ, అమ్మకాల కోసమూ సహాయం చెయ్యండి” అని అడిగారు. ఇంకో వైపు ఎంగెల్సు ఇంగ్లీష్, జర్మనీ భాషల్లో తనే రకరకాల సమీక్షలు రాశాడు.కొన్ని కావాలనే విమర్శిస్తూ రాశాడు.అంటే, పాఠకుల్లో ఒక రకమైన చర్చను లేవనెత్తడానికి. ఒక్కడే పది, పదిహేను సమీక్షలు రాసి, అమెరికాలోనూ, యూరప్ లో వున్న పత్రికలకు పంపించాడు. తనకు తెలిసిన వాళ్ళందరికీ కూడా ఉత్తరాలు రాశాడు. మిగతా వాళ్ళందరూ కూడా ఎవరు చెయ్యగలిగిన ప్రయత్నం వాళ్ళు చేశారు.

ఫలితం చాలా ఆశ్చర్యకరం. శూన్యం. కేపిటల్ –1 విడుదలైన జర్మనీలో గానీ, సొంత సమీక్షలు వచ్చిన ఇతర దేశాల్లో గానీ, ఎవ్వరూ పట్టించుకోలేదు. మార్క్స్, ఎంగెల్సులు ఆశించిన స్పందనకు పూర్తి విరుద్ధంగా తయారయ్యింది వాతావరణం. వాళ్ళు పంపించిన కాపీలు అందుకున్నవారు రకరకాలుగా వాఖ్యానాలు చేశారు. కొందరి వాఖ్యానాలు.

★మార్క్స్ ఇంత పెద్ద పుస్తకం పంపించాడు గానీ, దీన్ని ఎలా చదవాలో, ఎలా అర్థం చేసుకోవాలో ఆయనే ఇంకో పుస్తకం రాస్తే తప్ప దీన్ని అర్థం చేసుకోలేం.

★మహా మేధావి రాసిన ఈ పుస్తకం పెద్ద ఏనుగు లాగా వుంది. దీన్ని ఏం చేసుకోవాలో తెలియడం లేదు.

★మార్క్స్ గతంలో కుట్టు మిషన్ల వ్యాపారం చేశాడా? ఇన్ని వందల పేజీలు బాగా కుట్టాడు. ఎందుకో తెలియడం లేదు.

★పుస్తకంలోని ప్రతి పేజీలోనూ పాద సూచికలూ, వివరణలూ ఇచ్చాడు. ఏది ఫుట్ నోటో, ఏది ముందు చదవాలో, ఏది తరవాత చదవాలో తెలియడం లేదు.

★ఇందులో లెక్కలున్నాయి. సూత్రాలున్నాయి. సైన్సు వుంది. సమీకరణలు వున్నాయి. వేదాంతం వుంది. చరిత్ర వుంది. ఇంతకీ దీన్నించి ఏం నేర్చుకోవాలి?

దాదాపు ఇరవై సంవత్సరాల పురిటినొప్పులూ, ప్రసవ వేదనా, ఒక మేధావి జీవితం లోని దుర్భర పేదరికం, అన్నిటికీ మించి శారీరక అనారోగ్యం వీటి ఫలితంగా వెలువడిన కేపిటల్ పుస్తకానికి ఎదురైన ‘బాలారిష్టాలు’ ఇవన్ని. ’బాలారిష్టాలు’ అనే పదం చాలా జాగ్రత్తగా వాడుతున్నాను. పుస్తకం వచ్చిన నెల రోజులైనా ఎక్కడా కూడా సానుకూలమైన

స్పందన రాలేదు. పత్రికల్లో ఎక్కడా వ్యాసాలు రాయలేదు. మార్క్స్ ని కూడా ఎవరూ సంప్రదించలేదు.8 ఏళ్ళ క్రిందట 'పొలిటికల్ ఎకానమీ' కూడా ఇదే పరిస్థితి వచ్చింది.

ఇక మార్క్స్ పరిస్థితి చెప్పాల్సిన పనిలేదు. అసహనం, అసంతృప్తి,వాటితో మళ్ళీ అనారోగ్యం. ఒళ్ళంతా మళ్ళీ పుళ్ళు. ఒకవైపుకి మాత్రమే తిరిగి పడుకోవాల్సిన పరిస్థితి. రెండో అల్లుడు పాల్ దాదాపు వాళ్ళింట్లోనే ఉంటున్నాడు. పెరిగిన ఖర్చులూ, అల్లుడికి తెలియకుండా వున్న అప్పులూ. మళ్ళీ జీవితంలో ఘోర కల్లోలం. ఈ పరిస్థితిలో ఆ పబ్లిషరు కేపిటల్–2 గురించి ఒత్తిడి చెయ్యలేదు. మార్క్స్ కి కూడా రెండవ భాగం రాయాలనే ఉత్సాహం లేదు. ప్రపంచ కార్మికజన చైతన్యం కోసం రాసిన పుస్తకం అది.ఆ కార్మికులు పట్టించుకోలేదు. కార్మికులు తిరగబడితే ఈ వ్యవస్థ కూలిపోతుందన్న భయంతో బూర్జువాలు ఎలాగూ పట్టించుకోలేదు.

ఈ పరిణామాల వల్ల ఇంకా ఘోరంగా ఓడిపోయమన్న భావనకు గురయ్యారు మార్క్స్, జెన్నీలు. జెన్నీ ఏమనుకున్నదంటే..ఇన్నాళ్ళూ, ఇన్నేళ్ళూ పేదరికాన్ని భరించింది ఇందుకోసమా? మార్క్స్ మేధావి తనం గాలిలో కలసిపోతుందా? పసి పిల్లల్ని బలి తీసుకున్నదీ, జీవితాన్ని పణం గా పెట్టింది ఇందు కోసమేనా? అని ఆమె ఒకవిధమైన డిప్రషన్ లోకి వెళ్ళిపోయింది. మార్క్స్ కూడా అనుకున్నాడు. అప్పుడెప్పుడో అమ్మ చెప్పింది "నువ్వు ఆ 'కేపిటల్' పుస్తకం రాసేబదులు కేపిటల్ సంపాదించుకోరా!" అని. 'ఆ పని చేసినా బాగుండేదేమో' అనుకున్నాడు ఒకానొక క్షణంలో. ఎంగెల్సు మాత్రం ఈ 'కేపిటల్' విజయం మీద నమ్మకాన్నికోల్పోలేదు. 'ఈ పుస్తకానికి ఒక రోజు వస్తుంది.' అని ఎంగెల్సు మాత్రం పూర్తిగా నమ్మాడు. "మనం రష్యన్ బాష లోకి అనువదించాలి. రష్యన్స్ కి ఓపికా, సహనం ఎక్కువ. అదే వాళ్ళ విజయానికి కారణం. మనం కూడా ఈ విషయంలో సహనంతో వుండాలి."అన్నాడు.

వాళ్ళు అనుకున్నట్టుగానే 'కేపిటల్' వైపు ప్రపంచం అంతా తలలు తిప్పే రోజు వచ్చింది. ఎప్పుడూ? అప్పుడు కాదు మరో నాలుగేళ్ళ తర్వాత. మరి ఈ నాలుగేళ్ళలో అంటే 1872 వరకూ మార్క్స్ పరిస్థితి ఎలా వుంది? ఆ కుటుంబంలో ఏం జరిగింది? తెలుసుకుందాం.

**(కొనసాగింపు వచ్చేనెలలో)**

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 నవంబర్ 19 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

.

COMMENTS